తెలంగాణ ప్రజావారధి

ప్రతి అడుగు నిజం వైపు

www.telanganaprajavaradhi.com


తెలుగు దినపత్రిక



హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 01 గురువారం 01 - 10 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 1

మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో..

లంచావతారాలు



షరాఫ్ సాయికుమార్ కొట్టించుకున్న ఫోన్‌పే



- ప్రతి డాక్యుమెంట్‌కు రూ.10 వేలు ఫిక్స్ చేసిన సబ్ రిజిస్ట్రార్
- స్వంత ఆదాయం కోసం ప్రభుత్వ ఆదాయానికి గండి
- 15 రోజులుగా రిజిస్ట్రేషన్లు నిలిపివేసిన రిజిస్ట్రార్
- స్వంత రూల్స్ అమలు చేస్తున్నారని సబ్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు
- 22ఏ తిప్పలు తప్పినయంటే..సబ్ రిజిస్ట్రార్ తీరుతో జనం తిప్పలు
- పంచాయతీ సెక్రటరీలు, మున్సిపల్ కమిషనర్ ధ్రువీకరణ, లింక్ డాక్యుమెంట్లు ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తానంటున్న సబ్ రిజిస్ట్రార్
- వసూళ్లకు షరాఫ్‌ను పెట్టుకున్న సబ్ రిజిస్ట్రార్
- రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గడంతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు పొంచి ఉన్న ముప్పు

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూరు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో లంచావతారాలు తిష్ట వేశాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రతి డాక్యుమెంట్‌కు ఓ రేటు ఫిక్స్ చేసి వసూలు చేస్తుండటంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజల జేబులు గుళ్లవుతున్నాయి. రిజిస్ట్రేషన్ల కోసం అడిగిన డబ్బులు ఇవ్వకపోవడంతో గత 15 రోజులుగా రిజిస్ట్రేషన్లు గణనీయంగా తగ్గిపోయాయంటున్నారు. ఇటీవల నూతనంగా సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చిన అంబేద్కర్‌పై తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సినియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన డిప్యూటేషన్‌పై సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేసి ప్రమోషన్‌పై ఈనెల 15న మోత్కూరు సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చారు. ఆయన రావడం రావడంతోనే తన మార్క్ పనితీరు చూపిస్తున్నారని పలువురు ఆరోపించారు. రిజిస్ట్రేషన్లు చేయడంలో రకరకాల కొర్రీలు పెట్టడంతో పాటు తన స్వంత రూల్స్ పెట్టి రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలను వేధిస్తున్నారంటున్నారు. రిజిస్ట్రేషన్ అయ్యే ప్రతి డాక్యుమెంట్‌కు రూ.10 వేలు ఫిక్స్ చేయడంతో అంత డబ్బు ఇవ్వలేక రిజిస్ట్రేషన్లు బాగా తగ్గిపోయాయంటున్నారు. మామూళ్లు వసూలు చేసేందుకు కార్యాలయంలోనే షరాఫ్‌గా పని చేస్తున్న సోమగాని సాయికుమార్‌ను పెట్టుకున్నాడని, అతనే డబ్బులు వసూలు చేస్తున్నాడని పలువురు బాధితులు ఆరోపించారు.

స్వంత ఆదాయం కోసం ప్రభుత్వ ఆదాయానికి గండి

15 రోజులుగా రిజిస్ట్రేషన్లు నిలిపివేసిన రిజిస్ట్రార్ సబ్ రిజిస్ట్రార్ అంబేద్కర్ స్వంత ఆదాయం కోసం ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని డాక్యుమెంట్లు సక్రమంగా ఉన్నా పత్రాలపై ఏదో ఏ కొర్రి పెడుతున్నాడని, ఆయన చెప్పినట్టు డాక్యుమెంట్ తయారు చేసుకొచ్చినా మళ్లీ కుంటి సాకు చెప్పి రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన రాకముందు రోజుకు 10కి పైగా రిజిస్ట్రేషన్లు కాగా ఆయన వచ్చిన తర్వాత నుంచి ప్రభుత్వ నిబంధనలు కాదని స్వంత రూల్స్ అమలు చేస్తుండటంతో చాలా వరకు రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయని చెబుతున్నారు. గత నెలలో 15వ తేది వరకు 5 రోజులు సెలవులు ఉన్నప్పటికీ 139 రిజిస్ట్రేషన్లు కాగా, కొత్త సబ్ రిజిస్ట్రార్ వచ్చిన తర్వాత 16 నుంచి 30 వరకు 2 రోజులు మాత్రమే సెలవులు రాగా 87 రిజిస్ట్రేషన్లు మాత్రమే అయ్యాయి. అందులోనూ పాత రిజిస్ట్రార్ వెళ్లే ముందు ప్రాసెస్‌లో ఉన్న 15 రిజిస్ట్రేషన్లు ఉన్నాయని చెబుతున్నారు.

పంచాయతీ సెక్రటరీలు, మున్సిపల్ కమిషనర్ ధ్రువీకరణ, లింక్ డాక్యుమెంట్లు ఉంటేనే..

సబ్ రిజిస్ట్రార్ అంబేద్కర్ సార్ పెట్టిన రూల్స్‌తో జనం తలలు పట్టుకుంటున్నారు. గ్రామాల్లో ప్లాట్లు, ఇండ్ల రిజిస్ట్రేషన్ చేసేందుకు పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణ, మున్సిపాలిటీలో అయితే మున్సిపల్ కమిషనర్, టీపీవో ధ్రువీకరణ ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేస్తానని సార్ కండిషన్ పెట్టారు. కాగా మీరు చేసుకునే రిజిస్ట్రేషన్లకు తామెందుకు ధ్రువీకరణ చేసి సంతకాలు చేస్తామని పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఇదివరకే యాదాద్రి కలెక్టర్ పంచాయతీ కార్యదర్శులకు, మున్సిపల్ అధికారులకు ప్లాట్లు, ఇండ్ల రిజిస్ట్రేషన్లపై ఎలాంటి ధ్రువీకరణలు జారీ చేయొద్దని ఆదేశాలు జారీ చేశారు. దీంతో సబ్ రిజిస్ట్రార్ పెట్టిన రూల్స్‌తో రిజిస్ట్రేషన్లు కాక ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు. పైగా లింకు డాక్యుమెంట్లు ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేస్తానని ఖరాకండీ చెబుతుండటంతో గ్రామాల్లో లింకు డాక్యుమెంట్లు ఎక్కడివని లబోదిబోమంటున్నారు.

22ఏ తిప్పలు తప్పినయంటే..సబ్ రిజిస్ట్రార్ తీరుతో జనం తిప్పలు

నిన్న మొన్నటి వరకు 22ఏ సమస్యతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి ఇబ్బందులు పడిన ప్రజలకు సబ్ రిజిస్ట్రార్ పెట్టిన కండిషన్లతో తమ బాధలు మరింత రెట్టింపవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాధితునికి రికార్డుల్లో 236 గజాల స్థలం ఉండగా ఫీల్డ్‌పై 198 గజాల స్థలం మాత్రమే ఉంది. దాన్ని అతని సర్వే చేయించుకుని, పంచాయతీకి పన్ను చెల్లించి అన్ని పత్రాలతో రిజిస్ట్రేషన్ కోసం రాగా 236 గజాలు ఉంటే 198 గజాలకు ఎలా చేసుకుంటావని, పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణ తెస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పడంతో ఏదో తిప్పలు పడి ధ్రువీకరణ తీసుకరాగా దానిపై కొర్రి పెట్టడంతో పాటు పైగా పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణ ఎలా ఇస్తాడని జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో పంచాయతీ కార్యదర్శి భయంతో తానిచ్చిన ధ్రువీకరణను వెంటనే వెనక్కి తీసుకున్నాడు. విషయం తెలిసి రిపోర్టర్లు వెళ్లి ప్రశ్నించడంతో వెంటనే రిజిస్ట్రేషన్ చేశారు. మోత్కూరులో ప్రహిబిటెడ్‌లో పెట్టిన ఓ వెంచర్‌లో గత నెల వరకు రిజిస్ట్రేషన్లు కాగా.. అందులో ఓ ప్లాటు ఉన్న బాధితుడు కిడ్నీ ఆపరేషన్ కోసం నెల రోజుల క్రితం ప్లాట్ అమ్ముకుని రిజిస్ట్రేషన్ కోసం రాగా ఆ కాగితాలు... ఈ కాగితాలు లేవని ఖమ్మం, నల్లగొండ కార్యాలయాలకు తిప్పాడు. తీరా ఆ బాధితుడు సంబంధిత పత్రాలు తీసుకరాగా రిజిస్ట్రేషన్ చేసేందుకు మొండికేశాడు. రూ.50 వేలు ఇస్తే చేస్తానంటూ కార్యాలయంలో షరాఫ్‌గా పనిచేస్తున్న ఉద్యోగితో రాయభారం పంపాడని బాధితుడు ఆరోపించాడు. బిడ్డల పెళ్లిళ్లకు, చదువులకు, ఆస్పత్రి ఖర్చులకు, అప్పులు కట్టడానికి, ఇండ్ల కట్టుకోవడానికి ప్లాటో, ఇల్లో అమ్ముకుందామంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో లంచాల కోసం అధికారులు పెట్టే తిప్పలను భరించలేకపోతున్నామని చెప్తున్నారు. మిగతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నోడ్యూస్ సర్టిఫికెట్ల మీద రిజిస్ట్రేషన్లు అవుతుండగా ఇక్కడ మాత్రమే ఈ రూల్స్ ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

వసూళ్లకు షరాఫ్‌ను పెట్టుకున్న సబ్ రిజిస్ట్రార్

సబ్ రిజిస్ట్రార్ అంబేద్కర్ కార్యాలయంలో షరాఫ్‌గా పనిచేస్తున్న సాయికుమార్ ద్వారా వసూళ్లు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రిజిస్ట్రేషన్లు చేసుకున్న వ్యక్తులతో నేరుగా నగదు తీసుకోవడంతో పాటు ఫోన్ పే, గూగుల్ పే కొట్టించుకుంటున్నాడని ఆరోపిస్తున్నారు. కార్యాలయం మొత్తం ఈ ఇద్దరు కనుసన్నల్లో నడుస్తుందని చెబుతున్నారు. కొత్తగా సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చిన అంబేద్కర్ రాక ముందు బైక్‌పై రోజూ మిర్యాలగూడ నుంచి వచ్చే షరాఫ్ సాయికుమార్..ఆయన వచ్చిన తర్వాత కారులో వస్తున్నాడని, సూర్యాపేట నుంచి వచ్చే సబ్ రిజిస్ట్రార్‌ను సూర్యాపేట నుంచి తీసుకవచ్చి సాయంత్రం సూర్యాపేటలో దించి మిర్యాలగూడ వెళతాడని చెబుతున్నారు. సబ్ రిజిస్ట్రార్‌తో పాటు షరాఫ్ కూడా ఆయన ఛాంబర్‌లో ఉంటాడని, అతనితో మాట్లాడిన తర్వాతే రిజిస్ట్రేషన్లు చేస్తారని ఆరోపిస్తున్నారు. ఆయన ఫిక్స్ చేసిన డబ్బులు ఇవ్వకపోవడంతో సుమారు 40 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు కాకుండా నిలిచిపోయినట్టు తెలుస్తోంది.

రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గడంతో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కు పొంచి ఉన్న ముప్పు

సబ్ రిజిస్ట్రార్ అంబేద్కర్ పెట్టిన రూల్స్‌తో రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గిపోవడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి కొత్త ముప్పు ఏర్పడింది. రిజిస్ట్రేషన్లు కావడం లేదన్న సాకుతో గతంలోనే మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఇక్కడి నుంచి తరలించే ప్రయత్నం జరగ్గా ప్రజలు, అఖిలపక్షం నాయకుల ఆందోళనలతో ఆ ప్రయత్నానికి ఫుల్ స్టాప్ పడింది. ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్ అంబేద్కర్ వ్యవహార శైలితో ఆయన వచ్చిన 15 రోజుల్లోనే 50కి పైగా రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. అధికారులు మళ్లీ రిజిస్ట్రేషన్లు కావడం లేదని చూపితే మోత్కూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు మళ్లీ తెరపైకి వచ్చే ప్రమాదముంది. సబ్ రిజిస్ట్రార్, షరాఫ్‌పై డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై జిల్లా అధికారులు స్పందించి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆరోపణలన్నీ అవాస్తవం -అంబేద్కర్, సబ్ రిజిస్ట్రార్, మోత్కూరు

తనపై వచ్చిన ఆరోపలన్నీ అవాస్తవం. రిజిస్ట్రేషన్ల కోసం ఎవరినీ డబ్బులు అడగడం లేదు. రూల్స్ ప్రకారమే రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. గ్రామాల్లో ప్లాట్లు, ఇండ్ల రిజిస్ట్రేషన్ల కోసం పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీలో కమిషనర్, టీపీవో ధ్రువీకరణ ఉంటేనే రిజిస్ట్రేషన్లు చేస్తాం. లింక్ డాక్యుమెంట్లు తప్పనిసరిగా ఉండాల్సిందే. లింక్ డాక్యుమెంట్లు లేకుండా రిజిస్ట్రేషన్లు చేయడం లేదు. షరాఫ్ సాయికుమార్, తాను పెట్రోల్ ఖర్చులు తగ్గుతాయని ఒకే కారులో వస్తున్నాం. షరాఫ్‌ను పెట్టి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదు.